# ప్రారబ్దం!

బస్‌స్టాప్‌కి వచ్చి అరగంటవుతోంది. అయినా ఒక్క బస్సూ రావడం లేదు.

సారథికి విసుగ్గా వుంది. అతడీ వెయిటింగ్‌ని భరించలేకపోతున్నాడు.

ఎండ చురుక్కుమన్పించడంతో నీడపట్టుకి వెళ్దామని పక్కనే ఉన్న టైలర్ షాప్ చాటుకి వెళ్లి నిల్చున్నాడు.

అంతా దురదృష్టమే.

'లేదు... దేవుడు లేనే లేదు!' అంటూ ఈ కాస్త చిన్న విషయానికే మనసారా ఆడిపోసుకున్నాడు.

మాటి మాటికీ తలవంచి వాచీ వంక, తలెత్తి బస్సు వస్తుందేమోనని ఆశగా రోడ్డు వంక చూడ్డంతోనే సరిపోతోందతనికి.

అదే సమయంలో ఉన్నట్లుండి అతని తల తొంభై డిగ్రీల కోణంలోకి

తిరిగింది. దృష్టి కుడిభుజం మీదుగా అలవోకగా సాగి, షాప్‌కి అవతలివైపున ఉన్న నేలమీద పడింది. ఉత్సుకతతో మెడ జిరాఫీ మెడలా సాగింది.

నల్లగా... ఉబ్బెత్తుగా... మెరుస్తూ కనుపాపల్లో తళుక్కుమందా వస్తువు.

కళ్ళు చిట్లించి మరీ చూసాడు.

నిజంగా... అది పర్సే?!

ఆశ్చర్యచకితుడయ్యాడు.

ఎందుకనో నమ్మాలన్పించలేదతనికి.

కళ్ళు నులుముకుని మరోసారి చూసాడు. డౌట్ క్లియరయింది. ఆనందంతో తబ్బిబ్బైపోయాడు.

"యాహూ!" అంటూ ఎగిరి గంతేయాలనుకున్నాడు.

కానీ సీక్రెట్ లీకవుతుందేమోనని నిభాయించుకున్నాడు.

బస్ ఇంకా రాలేదన్న చింత-చిరాకు మరచి చిర్నవ్వు చిందించాడు.

అపుడపుడూ డబ్బు పోవడమేగానీ, ఏనాడూ ఒక్క నయాపైసా దొరకడం, అతడి జాతకంలోనే లేదు.

"లేటెస్ట్‌గా మొన్న... మొన్ననే కదూ! తన పర్స్ పోయింది. ఒకటా రెండా ఆరొందలున్నాయందులో. ఇది జరిగి రెండ్రోజులైనా కాలేదు. అదే టైప్‌లోనే మరో పర్స్ దొరకడం దేవుడి లీల కాకమరేమిటి?"

"ఉన్నాడు... దేవుడున్నాడు" అంటూ మనసారా అనుకున్నాడు.

"పర్స్ చూపునకు మాత్రం ఉబ్బెత్తుగానే వుంది. పర్వాలేదు. ఎంతో కొంత వుండే ఉంటుంది. పోయిన నా డబ్బుకి ఎక్కువ కావొచ్చు. తక్కువా అయివుండొచ్చు. మొత్తానికి నా డబ్బులో కొంతయినా ఈ రకంగా తిరిగి చేతికిరాబోతోంది. దిసీజ్ ఫస్ట్ టైమ్ ఇన్ మై లైఫ్..."

సారథి ఆలోచనలకి సడెన్ బ్రేక్ పడింది. గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది.

ఎందుకంటే ఎవరో ఆసామీ పర్స్‌వైపే వస్తున్నాడు.

"అతడి దృష్టి కూడా దానిమీదే పడినట్లుంది. అతడికంటే ముందే పరుగెత్తి తనే ఆ పర్స్‌ని చేజిక్కించుకుంటే?" క్షణకాలం తటపటాయించాడు సారథి.

ఆ వ్యక్తి పర్స్‌కి మరింత చేరువయ్యాడు.

"అయిపోయింది. అంతా అయిపోయింది. ఆ పర్స్ అతగాడి చేతిలో పడబోతోంది." బెంగపడి ఆశ పూర్తిగా వదులుకున్నాడు.

సారథి అంచనాల్ని తల్లక్రిందులు చేస్తూ పర్స్‌కి దగ్గరగా వెళ్లిన వ్యక్తి వంగనూ లేదు, దాన్ని తీయనూలేదు.

అసలు పర్స్ వంక కళ్ళు దించి చూసినట్టే లేదు. పర్స్‌కి సరిగ్గా అటో కాలు, ఇటో కాలు వేసి గంభీరవదనుడై నిల్చున్నాడు.

"హమ్మయ్య" అనుకొని ఊపిరి పీల్చాడు సారథి.

"ఆ పర్స్ నాదే! నో డౌట్! దట్స్ మైన్. త్వరలో నా జేబుని అలంకరించి, నా మనసుని అలరించబోతోంది. పోయిన నా పర్స్‌కి దొరికిన ఈ పర్స్ చెల్లు. లెక్క కుదిరిపోయింది.

లేకపోతే పర్స్ పోయాక తనెంతగా తల్లడిల్లాడని? ఆరాటందలంటే మాటలా? వారం రోజు జీతం డబ్బులవి. పోయిన డబ్బుని 'లైట్'గా తీసుకోవడానికదేం 'పై' సంపాదన కాదు. పూర్తిగా కష్టార్జితం.

ఆ పర్స్ పోయిన బాధలో అన్నం సహించలేదు. మనసంతా చికాకు, పిచ్చి పట్టినట్లయ్యింది. ఓ రకంగా చెప్పాలంటే డబ్బు పోగొట్టుకున్నాక ఈ మూడ్రోజులూ, తనెంత వేదననుభవించాడని?

నాలాగే ఈ పర్స్‌పోయిన వ్యక్తి కూడా డబ్బెక్కడ పోయిందోనని ఎంత కంగారు పడ్తున్నాడో? మరెంత క్షభ అనుభవిస్తున్నాడో?

**నిజమే... బాధ ఎవరిదైనా బాధే!**

ఈ ఆలోచన కలగ్గానే మనసులోని దుర్బుద్ధి పోయింది. మనసెంతో తేలికైపోయింది.

**డబ్బు సంపాదించడంలో పొందే ఆనందం కంటే, ఆ డబ్బు పోగొట్టుకున్నప్పుడు కలిగే బాధ ఎన్నో రెట్లు ఎక్కువ. స్వానుభవం నేర్పిన నగ్న సత్యమిది."**

ఓ వంక ఇలా ఆలోచిస్తూనే మరోవంక ఓరకంటతో ఆ పర్స్‌ని గమనించడం మానలేదను.

బహుశా, ఎదరు చూస్తోన్న బస్సొచ్చిందేమో? పర్స్‌పైన నిలబడ్డ ఇందాకటి

మహానుభావుడు హడావుడిగా పరుగెత్తుకు వెళ్ళాడక్కడి నుండి.

సారధి అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చాడు.

"ఆ పర్స్ కోల్పోయిన వ్యక్తి తనలా ఏమాత్రం బాధ పడకూడదు. అందులో రూపాయే వుండనీగాక! న్యాయంగా ఆ పర్స్ స్వంతదారునికి చెందాల్సిందే!

ఆ పర్సెవరిదో కనుక్కొని, ఆ వ్యక్తికే అందజేస్తాను. అందులో ఎంత డబ్బున్నా సరే నే ముట్టనుగాక ముట్టను. ఒకవేళ స్వంతదారుడి ఆచూకీ దొరకని పక్షంలో ఆ డబ్బంతా పేదలకి పంచేస్తాను! యస్! ఆ కాస్త తృప్తయినా మిగుల్తుంది..."

తన ఆలోచనల్ని కట్టిపెట్టి నెమ్మదిగా పర్స్‌వైపు కదిలాడు సారథి.

ఆ పర్స్ కనబడటం లేదు! తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. ఏదీ ఎటుపోయింది? ఇప్పటి వరకూ అక్కడేగా ఉంది?

ఓ రెండు నిమిషాలు ఆలోచనల్లో పడేసరికి, ఆ కాస్త గ్యాప్‌లోనే దాన్నెవరో కొట్టేసి వుంటారని సరిపుచ్చుకున్నాడతను.

ఆ పర్స్‌లోని డబ్బుని సొంతానికి వినియోగించుకోవాలన్న దుర్బిద్ధి మనసులో మెదిలినంతసేపు పర్స్ కళ్ళ ముందే కళకళలాడింది. కానీ, దాన్ని హక్కుదారుడికి అందచేద్దామన్న సద్భావన మనసులో కలిగేసరికి ఆ పర్స్ మరొకరి హస్తగతమయ్యింది.

**"ఓ మంచి పని చేయటానికి కూడా మనిషికి ప్రారబ్ధం ఉండాలి. ఆ ఘటన తనకి రాసిపెట్టి ఉన్నట్లు లేదు" వేదాంతిలా నవ్వుకున్నాడు సారథి.**

తిరిగి ఎప్పట్లా బస్ కోసం వెయిటింగ్ ప్రారంభించాడు.

**(23.03.2001)**

*